## కవిత చార్జిషీటుపై ఆర్డర్ రిజర్వు.. మే 29న తీర్పు

న్యూఢిల్లి,ఢిల్లి మద్యం పాలసీ అక్రమాల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన 7వ సప్లిమెంటరీ చార్జిషీటును పరిగణలోకి తీసుకునే అంశంపై మంగళవారం రౌజ్ అవెన్యూ కోర్టు విచారణ పూర్తి చేసింది. తీర్పును రిజర్వు చేస్తూ మే 29న వెలువరించనున్నట్టు న్యాయస్థానం పేర్కొంది. ఈ చార్జిషీటులో కవితతో పాటు మరో నలుగురిని నిందితులుగా పేర్కొంటూ అభియోగాలు నమోదు చేసిన విషయం తెలిసిందే. 8వేల పేజీలకు పైగా ఉన్న ఈ చార్జిషీటులో నిందితులకు వ్యతిరేకంగా సేకరించిన సాక్ష్యాధారాలు చాలా ఉన్నాయని పేర్కొంది. చార్జిషీటుపై విచారణ సందర్భంగా మనీలాండరింగ్ జరిగిన విధానాన్ని ఈడీ వివరించింది. మొత్తంగా రూ. 100 కోట్లు అక్రమ మార్గాల్లో చేతులు మారాయని వెల్లడించింది. సోమ, మంగళవారాల్లో వరుసగా రెండ్రోజుల పాటు ఈ చార్జిషీటును పరిగణలోకి తీసుకునే అంశంపైనే విచారణ జరిగింది. మరోవైపు ఇదే కేసులో అరెస్టయిన ఢిల్లి ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆమ్ ఆద్మీ పార్టీని సైతం నిందితుల జాబితాలో చేర్చుతూ 8వ సప్లిమెంటరీ చార్జిషీటు దాఖలైంది.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :84 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: గురువారం 23-05-2024 | పేజీలు:4 వెల: 2.00


# ఎపి కొత్త ప్రభుత్వంతో సఖ్యత కొనసాగిస్తాం



తిరుమల: ఎపిలో ఏర్పడబోయే నూతన ప్రభుత్వ సహకారంతో , ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి సాధించేలా తన వంతు కృషి చేస్తానని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.. ఇవాళ ఉదయం తిరుమల శ్రీవారిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. అనందరం ఆలయం వెలుపల రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, త్వరలో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు చేయ నూతన ప్రభుత్వ సహకారంతో, ఉభయ రాష్ట్రాల్లో సమస్యల పరిష్కారానికి, ముఖ్యమంత్రితో చర్చిస్తామన్నారు. అలాగే తిరుమలలో, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున కళ్యాణ మండపం, వసతి గృహం ఏర్పాటుకు, నూతన ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వాతావరణం అనుకూలించి, రైతాంగం సస్యశ్యామలం కావాలని కోరారు.

**తిరుమల శ్రీవారి సేవలో రేవంత్ రెడ్డి**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారుఉదయం రేవంత్ రెడ్డి తన మనవడు శ్రీనుకి తలనీలాలు చెల్లించుకున్నారు. అనంతరం ఉదయం 8.30 గంటలకు వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారిని దర్శించుకున్నారు. అయితే.. ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి తిరుమలకు వచ్చిన రేవంత్ రెడ్డికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. తిరుమల శ్రీవారి దర్శనార్థం రేవంత్‌రెడ్డి నిన్న సాయంత్రం తిరుమలకు చేరుకున్నారు. హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో రేణిగుంట ఎయిర్‌పోర్టుకు కుటుంబసమేతంగా చేరుకున్నారు. అనంతరం రోడ్డు మార్గాన శ్రీవారి దర్శనార్థం తిరుమలకు బయలుదేరి వెళ్లారు. రచనా అతిథిగృహం వద్ద సీఎం రేవంత్ రెడ్డికి టీటీడీ ఈవో ధర్మారెడ్డి స్వాగతం పలికారు. తన మనవడి పుట్టెంట్రుకులు స్వామి వారికి రేవంత్ కుటుంబ సభ్యులు సమర్పించారు. రాత్రికి తిరుమలలో రేవంత్ రెడ్డి బస చేశారు. ఇవాళ ఉదయం శ్రీవారిని దర్శించుకున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం హోదాలో రేవంత్ రెడ్డి తొలిసారిగా బాలాజీని దర్శించుకున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అనంతరం ఇవాళ తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు

# 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువతకు దూరమయ్యాం

నర్సంపేట : మా ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు చెప్పుకోలేక.. స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించి కూడా యువ'త'కు దూర'మయ్యాం. ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు పెంచి కూడా వారికి దూరమయ్యాం. ఇలా చేసింది చెప్పుకోలేక ఓడిపోయామ'న్నారు కేటీఆర్. నర్సంపేటలో ఏర్పాటు చేసిన వరంగల్ %-% నల్లగొండ %-% ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రచార సభలో కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థి రాకేశ్ రెడ్డికి మద్దతుగా ప్రసగించారు. ఈ ఎన్నికతో ఫలితంలో ప్రభుత్వం కూలిపోయేది లేదు. తారుమార అయ్యేది లేదు. 6 నెలల క్రితం అసెంబ్లీకి ఎన్నిక జరిగింది. కేసీఆర్‌తో సహా అందరం ప్రతి నియోజవర్గంలో పర్యటించాం. దయచేసి మోసపోకండి.. గోసపడుతామని చెప్పాము. కానీ ప్రజలు కాంగ్రెస్ వాగ్దానాలు నమ్మి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. ఇప్పుడు బాధ పడుతున్నారని కేటీఆర్ గురించి. చదువుకున్న విద్యావంతులు కాంగ్రెస్ పాలన గురించి ఆలోచించాలని కోరుతున్నాను. ప్రస్తుతం వ్యవసాయం పరిస్థితి ఏంటో ఆలోచించండి. ఎన్నికలప్పుడు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన అందమైన నినాదాలు ఎక్కడున్నాయో ఆలోచించండి. నాకు ఓటు వేస్తే 2 లక్షల రుణమాఫీ దస్త్రంపై డిసెంబరు 9న తొలి సంతకం చేస్తాన ని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చాడు. అర్జంట్‌గా బ్యాంక్‌కు వెళ్లి 2 లక్షల రుణం తెచ్చుకోవాల'ని కూడా సూచించారు. డిసెంబర్ 9 పోయింది.. మరో పది రోజులు అయితే జూన్ 9 వస్తది. ఆరు నెలలు గడిచిపోత. తొలిరోజే సంతకం చేస్తానని మోసం చేసిన రేవంత్ రెడ్డి నిలబెట్టిన అభ్యర్థి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో ఆలోచించాలని గ్రాడ్యుయేట్లను కేటీఆర్ నిర్ణయించారు. రైతు భరోసా 15 వేలు ఇస్తా.. భూయజమాలకు కాదు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇస్తానని రేవంత్ నమ్మబలికాడు. రైతు కూలీలకు ఏడాదికి 12 వేలు ఇస్తానని అన్నాడు. కౌలు రైతులకు రైతు భరోసా రాలేదు. తొలిసారి మోసపోతే మోసం చేసినోడిది తప్పు. రెండోసారి కూడా వాడి చేతిలో మోసపోతే మనది తప్పు అయితదని కేటీఆర్ అన్నారు.



తెలంగాణలోనూ బుల్డోజర్ రాజ్.. చోటా భాయ్‌పై కేటీఆర్ సెటైర్

హైదరాబాద్ : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి చెందిన నాయకుల, కార్యకర్తల ఆగడాలు మితీమిరిపోతున్నాయి. ఇతర పార్టీల నేతలు, కార్యకర్తలతో పాటు సామాన్య జనాలను బెదిరింపులకు గురి చేస్తున్నారు. అంతేకాదు భౌతిక దాడులకు కూడా కాంగ్రెస్ నాయకులు వెనుకాడడం లేదు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలో ఓ సామాన్యుడి ఇంటి వద్ద ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్డును అధికార పార్టీకి చెందిన నాయకులు జేసీబీతో కూల్చేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్ ట్వీట్ చేశారు. ఈ ఘటనను చూస్తుంటే.. బడా భాయ్ సూచనలను చోటా భాయ్ పూర్తిస్థాయిలో ఫాలో అవుతున్నాడని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. తెలంగాణలోనూ బుల్డోజర్ రాజ్ ఉన్నాడని కేటీఆర్ సెటైర్లు వేశారు. బీఆర్ఎస్ కౌన్సిలర్‌కు ఓటు వేసినందుకు గానూ, ఓ వ్యక్తి ఇంటిపైకి మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరుడు బుల్డోజర్ తీసుకెళ్లి రేకుల షెడ్డును కూలగొట్టాడు. కొల్లాపూర్ 1వ వార్డు ఎన్నికల్లో తనకు సపోర్ట్ చేయలేదని, తనకు మెజార్టీ రాకపోవడానికి నీవే కారణం అంటూ.. అధికారంలోకి వచ్చాక పాస్టర్ నర్సింహ ఇంటిపైకి మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరుడు, 1వ వార్డు కౌన్సిలర్ భర్త బుల్డోజర్ తీసుకెళ్లి హంగామా సృష్టించాడు. రేకుల షెడ్డును కూల్చేశాడు.

# బోనస్ ఇచ్చి కొనడానికి మీకు బాధ ఏంటి..

హైదరాబాద్,బోనస్ ఇచ్చి కొనడానికి మీకు బాధ ఏంటి.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఫైర్ అయ్యారు. తెలంగాణ రైతులను మరో సారి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తోంది. వంద రోజుల్లో రుణమాఫీ ఇచ్చి రైతులను దగా చేసింది. కౌలు రైతులకు 15 వేలు ఇస్తామని చెప్పారు. వారికి క్వింటాల్‌కు 500 బోనస్ ఇస్తామని చెప్పి ఒక్కటి కూడా అమలు చేస్తారు. రైతులను నయవంచన చేసి అధికారం లోకి కాంగ్రెస్ వచ్చి ఉన్నారు. దేవుడి పేరుతో ఓట్లు పెడుతూ ప్రజలకి మాత్రం పంగనామాలు పెడుతుంది ఈ ప్రభుత్వం అని ఉంది. సన్న వడ్లకు బోనస్ అని సన్నాయి నొక్కులు మాత్రమే. చెయ్యి గుర్తుకు ఓటు వేసినందుకు రైతులకు చేయి ఇస్తుంది ఈ కాంగ్రెస్ ప్రభుత్వం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. దొడ్డు బియ్యం కొనడం కోసం కేంద్ర ప్రభుత్వం సిద్ధం. బోనస్ ఇచ్చి కొనడంలో మీకు వచ్చిన బాధ ఏంటి? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఎంత ధాన్యం పండిన యే రకం అయినా కేంద్రం కొంటుంది... రైతులకు అండగా కేంద్రం ఉంటుంది... డబ్బులు చెల్లిస్తుంది. రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుంది .. దుర్మార్గం అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఒప్పందం ప్రకారం 22 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఖరీఫ్ సీజన్ ప్రకారం ప్రభుత్వం ఇంకా అందించింది. రబీలో 75 లక్షల మెట్రిక్ టన్నుల ఒప్పందం చేసుకుంటే 33 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించింది ఈ ప్రభుత్వం. అకాల వర్షాలతో ధాన్యం మొలకెత్తిన కొనుగోలు మాత్రం నామమాత్రంగా నత్తనడకన నడుస్తుందిరైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిన్న కోనుగులు చేసింది 75 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే అన్నారు. సోనియమ్మ రాజ్యం అంటే రైతుల కన్నీళ్లు చూడామా? అని ఉంది. కేంద్ర ప్రభుత్వం ధాన్యం FCI కి చేరే వరకు అయ్యే ఖర్చు మొత్తం భరుస్తుంది... రాష్ట్ర ప్రభుత్వం మీద ఒక్క పైసా కూడా భారం కూడా పడదు... ఇంకా కమీషన్ ఇస్తుంది కేంద్రం... కమీషన్ డబ్బులతో ఉద్యోగులకు జీతాలు ఇస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. దొడ్డు రకం వేస్తే అడ్డుకుంటామని సీఎం అంటున్నారని తెలిపారు. ఇప్పుడు ఎందుకు బోనస్ చెల్లించడం లేదో రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ చెప్పాలనుకుంటున్నారు. మీ గారెంటీలు గారడీలు కాకుంటే తెలంగాణ ఓట్ల మీద మీకు గౌరవం ఉంటే ఇచ్చిన హామీలు అమలు



చేయాలన్నారు. ఇప్పుడు కళ్ళలో ఉన్న దాన్యం కు బోనస్ చెల్లించి కొనాల్సిందే అని డిమాండ్ చేశారు. ధాన్యం మీద కనీస ధర 61 శాతం కేంద్ర ప్రభుత్వం పెంచింది. సన్న బియ్యం కి వెయ్యి బోనస్ ఇవ్వాలన్నారు. మిగిలిన ధాన్యానికి 500 బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఛత్తీస్ ఘడ్ ప్రభుత్వం వెయ్యి రూపాయల బోనస్ ఇచ్చింది. రుణమాఫీ చేయని కారణంగా రైతులు కొత్తగా రుణం తెచ్చుకునే పరిస్థితి. ఇప్పుడు రైతులు అప్పులు ఎక్కడ తెచ్చుకోవాలి... రైతు బతుకు ఏంది? అని ప్రశ్నించారు. ఆగస్టులో రుణమాఫీ చేస్తారనే నమ్మకం. ఆగస్టు వరకు వర్షాలు పడకుండా రేవంత్ రెడ్డి ఏమైనా ఆపుతారా? అని వ్యంగాస్త్ర వేశారు. 6 గ్యారంటీల పై సోనియమ్మ సంతకంతో ఇంటింటికి లెటర్ రాసింది కాంగ్రెస్ అన్నారు. భారత దేశాన్ని మోసం చేస్తున్న చరిత్ర కాంగ్రెస్ అని అన్నారు. కాంగ్రెస్ ఆలోచన గుంట నక్క కన్నా ఎక్కువగా ఉంటుందన్నారు. ఎన్ని తారలు మారినా కాంగ్రెస్ తీరు మారదన్నారు. 15 వందల తెలంగాణ బిడ్డల ప్రాణాలు తీసినందుకు సోనియా గాంధీ నీ జూన్ 2 న ఆవిర్భావ దినోత్సవం కు పిలుస్తున్నా రా? అని ప్రశ్నించారు. సోనియా గాంధీ ఎలా వస్తారు? అని ఉంది. తెలంగాణను ప్రజలు దంచి తెచ్చుకున్నారు సోనియా ఇవ్వండి. సోనియా వారసత్వ రాజకీయాలకు నాయకురాలు అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ప్రజల చేసి... సుష్మ స్వరాజ్ పోరాటంతో తెలంగాణ వచ్చింది. మార్కెట్ యార్డులు విజిట్ చేస్తానని కిషన్ రెడ్డి అన్నారు.

# మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి విశ్వరూపం...



అమరావతి,ఎన్నికల వేళ విధ్వంసానికి దిగిన మాచర్ల వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి విశ్వరూపం బయటపడింది. తాను ఎమ్మెల్యే అభ్యర్థి అనే విషయాన్ని మరిచిపోయారు. వీధి రౌడీ మాదిరిగా ప్రవర్తించారు.. అడ్డంగా దొరికిపోయారు. పోలింగ్ రోజు ఓ బూత్‌కి వెళ్లి ఈవీఎంలను నేల కేసి కొట్టారాయన. అందుకు సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. దీని తర్వాత ఇక్కడ పలు కేంద్రాలలోని వెబ్ క్యాబ్ లు పరిశీలించిన అధికారులు విస్తుపోయే నిజాలు వెలుగు చూశారు.. ఇదే తరహాలో మరో ఆరు కేంద్రాలలో ఎమ్మెల్యే ఈవిఎం లు ధ్వంసం చేసినట్లు రూడీ అయింది.. మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని పీఎస్ నంబర్ 202తో పాటు 7 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలను ధ్వంసం చేశారని ఏపీ సీఈవో కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది. దీనికంటే ముందు మాచర్ల నియోజకవర్గంలోని రెంటచింతల మండలం పాల్వాయిగేటు ప్రాంతం. సింపుల్‌గా చెప్పాలంటే టీడీపీ గట్టి పట్టుకున్న ప్రాంతం. మే 13న పోలింగ్ సందర్భంగా ఆ గ్రామంలోని తన అనుచరులతో కలిసి ఓ పోలింగ్ బూత్‌లోకి వెళ్లారు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి. ఈవీఎంను రెండు చేతులతో పైకి ఎత్తి నేలకేసి కొట్టారు. ఈవీఎంలతోపాటు వీవీ ప్యాట్ కిందపడి డ్యామేజ్ అయ్యాయి. ఈ సమయంలో ఓటు వేస్తున్న ఓ వ్యక్తి భయంతో అక్కడి నుంచి పారిపోయాడు. టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావు పిన్నెల్లిపైకి దూసుకెళ్లారు. ఆయన అనుచరులు అడ్డుకున్నారు. బూత్ నుంచి బయటకు వెళ్తూ పిన్నెల్లి.. టీడీపీ ఏజెంట్లపై ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులుగానీ, పోలింగ్ సిబ్బంది ఆయన్ని అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఎమ్మెల్యే అభ్యర్థి వస్తున్న క్రమంలో పోలింగ్ సిబ్బంది నిలబడి ఆయనకు నమస్కారం పెట్టడం గమనార్హం. ఇక ఈ విషయాన్ని ఈసీ చాలా తీవ్రంగా పరిగణిస్తూ, ఈ ఘటనల్లో ప్రమేయం ఉన్న వ్యక్తులందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఈవో ముఖేష్ కుమార్ మీనా డిజిపిని ఆదేశించారు.. ఏడు ఈవీఎంల ధ్వంసం ఘటనకు సంబంధించి కేసు దర్యాప్తులో సహకరించేందుకు పల్నాడు జిల్లా ఎన్నికల అధికారులు అటువంటి అన్ని పోలింగ్ స్టేషన్ల వీడియో ఫుటేజీని పోలీసులకు అందజేశారు. విచారణలో ఎమ్మెల్యే పేరును నిందితుడిగా చేర్చారు.. . తద్వారా ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించే విషయంలో భవిష్యత్తులో ఎవరూ ఇటువంటి దుశ్చర్యలకు సాహసం చేయరని ఎన్నికల సంఘం భావిస్తోంది. ఈవీఎం ధ్వంసానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఘటనకు బాధ్యులైన వారందర్నీ ఆరెస్ట్ చేయాలని కూడా మీనా కోరారు.. అలాగే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే పై క్రిమినల్ చర్యలతో పాటు భవిష్యత్ లో ఎన్నికలలో పాల్గొనకుండా నిషేదం విధించే అవకాశాలను పరిశీలిస్తున్నారు..

### చార్‌ధామ్ యాత్రికులకు నిరాశ

డెహ్రాడూన్,హిందువులు ఎంతగానో ఎదురుచూసే చార్ ధామ్ కేదార్నాథ్ ఆలయ తలుపు తెరచుకోవడంతో ప్రారంభమైంది. ఉత్తరాఖండ్‌లోని చార్ ధామ్ యాత్రకు దేశ నలుమూలల నుంచి మాత్రమే కాదు విదేశాల నుంచి కూడా భక్తులు వస్తున్నారు. ఊహించిన దానికంటే యాత్రలో భారీ సంఖ్యలో భక్తులు యాత్రకు పోటెత్తుతున్నారు. దీంతో ఉత్తరాఖండ్ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రభుత్వం నిషేధించింది. చార్ ధామ్ యాత్ర కోసం హరిద్వార్, డెహ్రాడూన్‌లలో రవాణా శిబిరాలు ఏర్పాటు చేసారు. గత కొన్ని రోజులుగా ఆఫ్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు. నాలుగు ధామ్‌లలో పెరుగుతున్న రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆఫ్‌లైన్

# యూపీలో ఇండియా కూటమి వ్యూహాలు..

యూపీ:మరోసారి అధికారమే లక్ష్యంగా ఎన్డీయే కూటమి, ఈసారి ఎలాగైనా అధికారంలోకి రావాలని ఇండియా కూటమి వ్యూహాలు రచిస్తున్నాయి. అటు కాంగ్రెస్ సారధ్యంలోని ఇండియా కూటమికైనా, ఇటు బీజేపీ ప్రత్యామ్నాయం రాష్ట్రంలో ఎన్డీయే కూటమికైనా యూపీని లోక్ సభ స్థానాలు కీలకం అనేది ఓపెన్ సీక్రెట్. 80 సీట్లు ఉన్న ఇక్కడి నుంచి 2019లో బీజేపీ 62 స్థానాలు గెలుచుకొని యూపీలో తిరుగులేని శక్తిగా అవతరించింది. అయితే, ఇప్పుడు రాజకీయ పరిణామాలు మారాయని ఇండియా కూటమి చెబుతోంది. వారణాసి మినహా 79సీట్లు గెలవబోతున్నామని ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ ఉన్నారు. అఖిలేష్ ధీమా ఏంటని చర్చ జరుగుతుండగా కీలక పరిణామం చోటు చేసుకుంది. సుల్తాన్ పూర్ జిల్లాకు చెందిన ప్రముఖ నేత చంద్రభద్ర సింగ్ ను ఎస్పీలో చేర్చుకొని బీజేపీకి హెచ్చరికలు పంపారు అఖిలేష్ యాదవ్. యూపీలో బలమైన ఠాకూర్ సామాజిక వర్గానికి చెందిన చంద్రభద్ర సింగ్ ఈ నియోజకవర్గంతో పాటు కొన్ని సెగ్మెంట్లలో ప్రభావం చూపుతున్నారు. గత ఎన్నికల్లో సుల్తాన్‌పూర్ నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన బీజేపీ అభ్యర్థి మేనకా గాంధీకి గట్టిపోటీ ఇచ్చారు. ఆ ఎన్నికల్లో మేనకా గాంధీ కేవలం 14,526 ఓట్ల తేడాతో గెలిచారు. ఆమెకు 4,59,196 ఓట్లు రాగా, చంద్రభద్రకు 4,44,670 ఓట్లు వచ్చాయి. మరోసారి సుల్తాన్‌పూర్ బీజేపీ నుంచి సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ పోటీ చేస్తుండగా, ఇండియా కూటమి నుంచి ఎస్పీ అభ్యర్థిగా రామ్‌భూల్ నిషాద్ బరిలో నిలిచారు. అయితే, మేనకాగాంధీని ఎస్పీ ఓడించే పరిస్థితి లేదని ఇటీవల విశ్లేషణలు వ్యక్తం అవుతు న్నాయి. ఈ నియోజకవర్గానికి మే25న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో చంద్రభద్ర సింగ్ ఎస్పీలో చేరడంతో బీజేపీ అభ్యర్థికి గట్టి పోటీ తప్పదని స్పష్టం అవుతోంది. అంతేకాదు, ఆయన ప్రభావం చూపుతుందా లోక్ సభ సెగ్మెంట్లపై కూడా ఉ





ండటంతో పాటు, ప్రభుత్వంపై వ్యతిరేకత వెరసి అఖిలేష్ చెప్పినట్టుగా కాకపోయినా యూపీలో ఇండియా కూటమి డబుల్ డిజిట్ స్థానాలను గెలుస్తుందా..?

### ప్రాజెక్టుల రీ డిజైన్ కొంపముంచింది

కరీంనగర్,మే22: కమిషన్ల కోసమే కేసీఆర్ ప్రాజెక్టులను రీ డిజైన్ చేశారని, దాని ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నామని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కమిషన్ల కోసమే రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను కాంట్రాక్టర్ మెఘా కృష్ణారెడ్డికి కట్టబెట్టారని వెల్లడించారు. దాని ఫలితమే ఇవాళ మేడిగడ్డ కుంగిపోవడం, మరమ్మత్తులకు కూడా కష్టంగా మారిందని అన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ నాయకులు తప్ప ఏ ఒక్క వర్గం బాగుపడలేదని విమర్శించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నంత కాలం రైతుకు శాపమని.. తేలిందని అన్నారు. సర్కార్ మారితేనే రైతులు బాగుపడ్తారని.. ఉద్యోగాలొస్తాయని చెప్పామని, ఇప్పుడు ఆ దిశగా సిఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కడితే మూడు నెలలకే మునిగిపోయిందన్నారు.

# ఈనెల 29, 30 తేదీల్లో ధర్నా చేస్తాం..

వరంగల్:వరంగల్‌లో మేడారం పూజారులు ఆందోళనకు సిద్ధమవడం హాట్ టాపిక్‌గా మారింది. వరంగల్‌లో ధార్మిక భవనం స్థలం విషయంలో మేడారం పూజారులు, దేవాదాయ వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మేడారం పూజారులు నిరసనలకు పిలుపునివ్వడం చర్చనీయాంశంగా మారింది. మేడారం జాతర భవిష్యత్తు అవసరాల కోసం 1993లో అప్పటి ప్రభుత్వం వరంగల్‌లోని రంగంపేటలో 1000 గజాల స్థలాన్ని కేటాయించింది. అయితే.. ఈ స్థలంలో ఏడాది క్రితం భద్రకాళి, మెట్టుగుట్ట, మేడారం జాతర నిధులతో ధార్మిక భవనాన్ని నిర్మించారు. అనంతరం వివిధ ఆలయాల కార్యనిర్వహణాధికారుల కార్యాల యాల వారు ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ధార్మిక భవనాన్ని, స్థలాన్ని దేవతా శాఖ పరిధిలోకి తీసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని మేడారం అర్చకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఇది మేడారం సమ్మక్క సారక్క దేవతలకు కేటాయించిన స్థలం అని మేడారం పూజారులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై.. మంత్రులు, జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదు. మే 29, 30 తేదీల్లో మేడారం గద్దెల ప్రాంగణానికి తాళం వేసి ధర్నా చేస్తామన్నా రు. ఇదిలావుంటే..తాజాగా.. దేవాదాయ శాఖపై మంత్రి కొండా సురేఖ కీలక సమీక్ష



చేశారు. అంతేకాకుండా వివాదాన్ని పరిష్కరించేందుకు దేవాదాయ శాఖ అధికారులు ఇప్పటికే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ క్రమంలో వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ వివాదాన్ని ఎలా పరిష్కరిస్తారనేది వేచి చూడాలి. అయితే.. మే 29,30 తేదీల్లో మేడారం గద్దెల ప్రాంగణానికి తాళం వేసి ధర్నా చేపడతామనడంతో ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో హాట్ టాపిక్ గా మారింది.

## సంపాదకీయం

గురువారం 23-05-2024

# పరిశ్రమలే ఆర్థిక సోపానాలు

రాష్ట్ర ప్రాథమిక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అనేవి తెలంగాణ వంటి అభివృద్ధి కోసం రైలు పట్టాల్లాంటివి. ఈ రెండింటి మధ్య సమన్వయం లోపిస్తే ప్రభుత్వాలు ఆర్థికంగా దివాళా తీయక తప్పదు. అయితే ఎన్నికల్లో గెలుపోటముల దృష్ట్యా రెండో దానికే పార్టీలు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తాయి. వాటికీ లక్ష్మణరేఖలు గీసుకుంటేనే పార్టీలకు, ప్రజలకు శ్రేయస్కరం. రాష్ట్రంలో గద్దెనెక్కిన కాంగ్రెస్ ఆర్నెళ్లకే కుడితిలో పడ్డ ఎలుక చందం తిప్పలు పడుతుంటే అలవికాని హామీల ఉచ్చు ఎలా ఉంటుందో తెలుస్తున్నది. మంత్రిమండలిలో చర్చించకుండానే మన ముఖ్యమంత్రి అధికారుల చేతులు పట్టుకొని ఎలాగైనా ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాలని ఆదేశిస్తున్నారు. ఎంత పన్నులు, ధరలు పెంచినా హామీల గోతం సంచి నిండదు. ఈ హామీలు మమ్మల్ని అడిగి ఇచ్చారా అని అధికారులు మాత్రం అడగలేరు. అయితే, మరోదారి లేక అడ్డదిడ్డంగా పన్నులు, ఛార్జీలు పెంచితే ప్రజల కొనుగోలు శక్తి తగ్గి ఇతర రంగాల అభివృద్ధిపై దాని ప్రభావం పడుతుంది. సామాజిక, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వం చేయూతనిస్తూనే తన ఆదాయాన్ని పెంచే మార్గాలను తప్పకుండా వెతుక్కోవాలి. ఆదాయ వృద్ధికి పన్నుల పెంపు, భూముల అమ్మకం పరిష్కారం కానే కాదు. అందుకు పారిశ్రామికాభివృద్ధియే దివ్యమైన మార్గం. అది ఉద్యోగ కల్పనతో పాటు పలురకాల ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. దీనివల్ల ఉపాధి మార్గాలు పెరిగి రాష్ట్రంపై సంక్షేమ పథకాల భారం క్రమంగా తగ్గుతుంది. నిజానికి గత పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ విజన్‌తోనే ప్రణాళికలు రూపొందించింది. దేశ, విదేశీ కంపెనీల రాక కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరచి ఎన్నో విజయాలను కలిగి ఉంది. కొత్త పరిశ్రమల ఉత్పత్తి మొదలై లక్షలాది యువతకు ఉపాధి లభించడంతో ఎన్నో కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు తీరేది. ఉన్నది ఉన్నట్టు మాట్లాడుకోవాలంటే ఖాళీ అయిన ఉద్యోగానికి నియామకం జరపడం ఎవరి వల్ల కాదు. ఉదాహరణకు టెక్నాలజీ అభివృద్ధి వల్ల ప్రభుత్వ బ్యాంకుల సిబ్బంది నియామకం ఆపివేసి, ఉన్న సంఖ్యను కూడా తగ్గించుకుంటున్నాయి. బ్యాంకుల్లో ఖాళీ పోస్టులను నింపమని ఎవరూ కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీయడం లేదు. అదే బాటలో ఫలితాలు కూడా ఆర్థిక పరిస్థితిని అంచనా వేసుకొని అవసరం ఉన్న వాటికి మాత్రమే నియామకాలు జరుపుకొంటాయి. దుకాణం యజమాని కూడా తమ బేరాన్ని, లాభాన్ని బట్టి పనివాళ్లను పెంచుకుంటాడు, తగ్గించుకుంటాడు. ఈ రోజుల్లో ఎవరైనా లక్ష ఉద్యోగాలు ఇస్తే అది సాధ్యపడని విషయమే. ఖాళీ ఉద్యోగాలు పూరిస్తామని, అందాక నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఆశ చూపడం అంటే యువతను ఖాళీగా ఉంచడమే. అందుకోసం ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి లభించే చర్యలు ముమ్మరం చేయాలి. అందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్ల పాలనలో ప్రపంచంలోని ప్రముఖ పరిశ్రమలకు ఆహ్వానం పలికి నిరుద్యోగితను తగ్గించేందుకు తీవ్రంగా కృషిచేసింది. రాష్ట్రంలో నిరంతర విద్యుత్తు, నీటి సరఫరాతో పాటు విశాలమైన సంస్థలు, భారీ నిర్మాణాలకు తగిన వనరుల లభ్యత కల్పించడంతో గత కొన్నేండ్లుగా దేశంలో ఎక్కడికీ రానన్ని పరిశ్రమలు హైదరాబాద్‌కు వచ్చాయి. రాష్ట్ర ప్రాథమ్యాలైన వ్యవసాయాన్ని, దాని అనుబంధ రంగాలైన కోళ్ల, గొర్రెల, చేపల పెంపకాలను ప్రోత్సహిస్తూనే మరోవైపు హైదరాబాద్ కేంద్రంగా ప్రపంచ స్థాయి పరిశ్రమలను నగరానికి వచ్చేలా ప్రాథమిక సౌకర్యాలు అభివృద్ధి చేసింది. ఈ పదేండ్ల శ్రమ ఫలితంగా హైదరాబాద్ ప్రపంచపటంలో ఉత్తమ వ్యాపార కేంద్రంగా గుర్తింపబడింది. పారిశ్రామిక అభివృద్ధికి కేవలం ఐటీ రంగాన్నే నమ్ముకోకుండా ఎన్నడూ వెనుకడుగేయని ఫార్మా, జీవ విజ్ఞానం, రవాణా, టూరిజం, విద్యారంగాలపై దృష్టిసారించింది. కొత్త ఫార్మా కంపెనీల రాకతో హైదరాబాద్ ఇప్పుడు దేశంలోని మందుల ఎగుమతుల్లో 20 శాతం కైవసం చేసుకున్నది. జీవ విజ్ఞాన పరిశోధనలు హైదరాబాద్‌ను విశ్వనగర స్థాయికి తీసికువెళ్లాయి. ప్రాణాంతక వ్యాధులకు మందులు, వాక్సిన్లు తయారుచేసే నోవార్టిస్ లాంటి కంపెనీలు మన నగరంలో తన పరిశోధనలు ప్రారంభమయ్యాయి. మెడికల్ డివైజ్ పార్క్, ఫార్మా సిటీ వైద్య పరిశోధనలకు ప్రత్యేకమైనవి. ఈ ఉత్పత్తులలో సుమారు 6 లక్షల ఫార్మా నిపుణుల అవసరం ఏర్పడుతుంది. రియల్‌టేట్ రంగంలో కూడా విదేశీ సంస్థల పెట్టుబడులకు ముందుకువచ్చాయి. ప్రధాన ఏడు నగరాల్లో రియల్ ఎస్టేట్ దేశంలో విదేశీ పెట్టుబడుల్లో 32 శాతం నగరానికే దక్కింది. పర్యాటకరంగాన్ని కూడా ప్రభుత్వం ఆదాయంగా మార్చుకుంది. అందమైన హైదరాబాద్ నగరాన్ని గత సంవత్సరం 2 లక్షల విదేశీ పర్యాటకులు సందర్శించారు. దాని వల్ల రూ.26 కోట్ల రాష్ట్రం పెరిగిందని రైల్వే టూరిజం చెప్పింది. 2016లో స్థాపించిన ఐటీ హబ్ ద్వారా ఇప్పటికే 5 వందల స్టార్టప్ కంపెనీలు అనుమతులు పొందాయి. విదేశాల్లోని భారతీయులు, అక్కడ చదువు నిర్వహణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు మన ఐటీ హబ్‌లో తమ అరంగేట్రానికి వస్తున్నారు. ట్రిపుల్ ఐటీ, ఐఎస్‌బీ, నల్సార్ సంస్థల సమన్వయంతో భిన్న పరిశ్రమల స్థాపనకు నగరం కేంద్రమైంది. ఇలా గత పదేండ్లలో ప్రభుత్వం రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, అనేక రంగాలకు పని కల్పన, యువతకు ఉపాధి అవకాశాల సృష్టికి రంగం సిద్ధం చేసింది. దాని ఫలితాలు వస్తుండగా అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. ఒక ఇంటర్వ్యూలో 'ఇన్ని కంపెనీలను, పెట్టుబడులను చిత్రాలకు తెస్తున్న మీకు సంక్షేమ పథకాలు ఏమొచ్చింది?' అనే ప్రశ్నకు 'ప్రభుత్వ దీర్ఘకాలిక ప్రణాళికలు ఇప్పుడిప్పుడే ఫలితాలనిస్తున్నాయి. నమూనాకు వచ్చిన కంపెనీలు పూర్తిస్థాయిగా ఎదిగి ఉపాధి కల్పించే వరకు ఓట్ల కోసమైనా పథకాలు తప్పవు. గెలవాలంటే ఓట్లు కావాలి. గెలిస్తేనే ఏమైనా చేయవచ్చు' అని అన్నారు. రాష్ట్ర ఓటర్ల ఆలోచనాసరళిని అంచనా వేసి చెప్పిన సమాధానం అది. అయితే, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పూర్తిగా తెలిసిన వారు కాబట్టి ఈ ఎన్నికల సమయంలో హామీల వేలం పాటలో పోటీ పడలేదు. ఇంత అనుభవం, దూరదృష్టి ఉండి అరణ్యవాసంలా పాలనకు దూరమైన బీఆర్ఎస్‌పై ప్రతిపక్షంగా ఎన్నో బాధ్యతలున్నాయి. ఒప్పందానికి వచ్చిన కంపెనీలకు ఒప్పందాలు కల్పించి రాష్ట్ర ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టవలసిన అవసరం కొత్త ప్రభుత్వంపై ఉంది.

# ఎన్నికల్లో చెమటోడుస్తున్న కాంగ్రెస్

న్యూఢిల్లీ,మరోమారు అధికారం దక్కించుకునే క్రమంలో ప్రధాని మోడీ వేస్తున్న ఎత్తులకు కాంగ్రెస్ పై ఎత్తులు వేస్తోంది. ఇండియా కూటమి జోరుగా ప్రచారం చేస్తోంది. ప్రాంతీయ పార్టీలను కలుపుకోవడమే గాకుండా వారి కోసం కాంగ్రెస్ మెజార్టీ సీట్లను కూడా వదులుకుంది. ఐదు దశల పోలింగ్ ముగిసింది. మరో రెండు దశల్లో జూన్1తో పోలింగ్ ముగియనుంది. 4న ఫలితాలు వెల్లడి కానున్నాయి. అయితే గతంలో ఎప్పుడూ లేనంతగా కాంగ్రెస్ చెమటోడుస్తోంది. మాదే అధికారం అని ప్రచారం చేసుకుంటోంది. బిజెపి కేవలవం 180 సీట్లకే పరిమితం అవుతుందని ప్రచారం చేస్తోంది. కులగణన, పేదింటి మహిళల ఖాతాల్లో లక్ష నగదు జమవంటి ఆకర్శక పథకాలను ప్రస్తావిస్తోంది. అలాగే అధికారమే లక్ష్యంగా సర్వశక్తులు ఒడ్డుతున్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు, అన్నా చెల్లెళ్లు అయిన రాహుల్, ప్రియాంకలు దేశమంతా చుట్టి వస్తున్నారు. పాత కాంగ్రెస్ తరహాలో ఎన్నికల ప్రచార భారాన్ని భుజాన వేసుకున్నారు. మోడీ, అమిత్ షాలకు ధీటుగా ప్రచారం చేపట్టారు. విమర్శలకు ప్రతి విమర్శలు చేస్తున్నారు. తడబాటు లేకుండా ప్రచారం చేస్తున్నారు. ఈ క్రమంలో బిజెపి, మోడీ, అమిత్ షాలు కూడా కాంగ్రెస్‌ను ప్రధాన ప్రతిపక్షంగా అంగీకరించి ఎదురుదాడికి దిగుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఇది వారికి తొలి విజయంగానే గుర్తించాలి. కర్నాటక, తెలంగాణల్లో అధిరకారం దక్కించుకోవడంతో కాంగ్రెస్‌లో భరోసా పెరిగింది. రాహుల్ నాయకత్వంపై దేశవ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణుల్లో కొంత నమ్మిక ఏర్పడింది. భాగస్వామ్య పక్షాలు కూడా రాహుల్‌ను అంగీకరిస్తున్నారు. కాంగ్రెస్ శ్రేణులు భావి ప్రధానిగా భావిస్తున్నారు. తమ తదుపరి ప్రధాని రాహుల్ అంటూ ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇకపోతే బిజెపిలో కూడా మోడీ తీరుపై అంతర్గతంగా తీవ్ర వ్యతిరేకత ఉంది. మోడీ,అమిత్‌షాలు పార్టీని తమగుప్పిట్లో పెట్టుకుని ఆడిందే ఆటగా సాగిస్తున్నారన్న ఆందోళన నెలకొంది. విపక్షాలు లేవనెత్తే అంవాలపై ప్రధాని మోడీ నేరుగా సమాధానం ఇవ్వడం లేదు. ఇంతకాలం కేవలం ప్రచారానికి మాత్రమే పరిమితం అయిన ప్రియాంకను ఇక నేరుగా ప్రతక్ష్యక్ష రాజకీయాల్లోకి దింపడం ద్వారా మోడీని ఢీకొనాలని రాహుల్ ఎత్తుగడ వేశారు. ప్రియాంక గాంధీ ఎప్పటికైనా రాజకీయాల్లోకి వస్తారా, రారా? అన్న ప్రశ్న మెదులుతూనే ఉంది. కొడుకు కోసం సోనియా అడ్డుపడుతున్నదన్న ప్రశ్నలు ఇంతకాలం వేధిస్తూ వచ్చాయి. అచ్చం ఇందిరమ్మలాగా ఉండే ప్రియాంక వస్తేనే కాంగ్రెస్ బతికిబట్టకట్టడం సాధ్యమని భావిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు అధికంగా ఉన్నారు. అయితే ప్రచారంలోకి దిగినా ఆమె ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నారు. రాహుల్‌కు పోటీగా ఉండకుండా అన్నకే మద్దతుతో ప్రచారం చేస్తున్నారు. రాయబరేలిలో కూడా పోటీకి దూరంగా ఉన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో మోదీని ఓడించడం సాధ్యం కాధన్న భావనలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. ఈ దశలో ఇక ప్రియాంక మాత్రమే కాంగ్రెస్‌ను బతికిస్తుందని అని ఇంతకాలం నమ్ముకున్న కాంగ్రెస్ అభిమానులకు ప్రియాంక రాజకీయరంగ ప్రవేశం, ప్రచారం రెట్టించిన ఉత్సాహాన్ని నింపింది. ఇంతకాలం కుటుంబపరంగా అమ్మ, అన్నల విజయం కోసం అమేథీలోనూ, రాయ్‌బెరెల్లీలోనూ ప్రచారం చేస్తూ వచ్చిన ప్రియాంక, పార్టీ కోసం పనిచేయలేదు. ప్రియాంక ఇప్పుడు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ హోదాలో దేశవ్యాప్తంగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇది మోదీపై రాహుల్ సర్జికల్ దాడి అనీ, రాజకీయ బ్రహ్మాస్త్రమనీ చాలామంది భావిస్తున్నారు. ప్రియాంకను పూర్తిస్థాయిలో తెరమీదకు తేవడంతో బీజేపీ వణికిపోతున్నదని రాహుల్ కూడా అంటున్నారు. మొత్తంగా రాజకీయ ఎత్తుగడలు సాగుతున్నాయనే చెప్పాలి. ప్రియాంక ప్రభావం దేశమంతటా కాంగ్రెస్ పునరుజ్జీవనానికి ఉపకరిస్తుందని కాంగ్రెస్ నాయకులు సంతోషిస్తున్నారు. సార్వత్రక ఎన్నికల్లో హస్తినలో పాగా వేయాలంటే 80స్థానాలున్న యూపీ అత్యంత కీలకం. పార్టీ యావత్తూ నిస్తేజంగా, నిరాసక్తంగా ఉన్న ఈ స్థితిలో ప్రియాంక ప్రవేశం పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహన్ని ఇచ్చింది. మోదీ హవాతో యూపీలో బీజేపీ పరిస్థితి ఒక్కసారిగా మారినట్టు, ప్రియాంక రాక కాంగ్రెస్‌ను విజయ తీరాలకు చేరుస్తుం దని ఆశిస్తున్నారు. యోగి సహా కేంద్రక్యాబినెట్‌లోని అనేకమంది మంత్రులు గెలుచుకొస్తున్న తూర్పు యూపీని స్వాధీనం చేసుకోవడం, తద్వారా బీజేపీ అధికారంలోకి వచ్చే అవకాశాలను దెబ్బతీయడం కాంగ్రెస్ ప్రధాన లక్ష్యం. సగం స్థానాలున్న తూర్పు ప్రాంతంలో ఒకప్పుడు కాంగ్రెస్ పక్షాన నిలిచి, ఇప్పుడు బీజేపీ ఓటుబ్యాంకుగా మారిన అగ్రకులాలవారిని తిరిగి మెప్పించి రప్పించే బాధ్యత ప్రియాంక తీసుకున్నారు. అయితే ప్రియాంకను పూర్తిస్థాయిలో రాజకీయంగా దింపితే తప్ప బ్రహ్మాస్త్రంగా ప్రయోగిం చడం సాధ్యం కాదని కాంగ్రెస్ శ్రేణులు అభిప్రాయ పడుతున్నాయి. ప్రస్తుత ప్రచారంతో ఆమె ఏ మేరకు కాంగ్రెస్‌కు తురుపుముక్కగా పనికి వస్తారన్నది ఎన్నికల ప్రచారం, సరళి, ఫలితాలను బట్టి తేటతెల్లం కానుంది. యూపీలో చెప్పుకోదగ్గ నాయకత్వం లేని కాంగ్రెస్‌కు ఇప్పుడు ప్రియాంక రాకతో ఆ కొరత మాత్ర తీరుతుంది. అయితే మోడీ, అమిత్ షా వేస్తున్న ఎత్తుల ముందు కాంగ్రెస్ ఏ మేరకు నిలబడుతుందన్నదే ప్రశ్న. మరో రెండు దశల్లో జరుగున్న ఎన్నికల తరవాత విజేత ఎవరన్నది తేలనుంది. ఎవరు ఎంతగా ప్రచారం చేసి, ప్రజలను దగ్గరుకు చేర్చుకున్నారో తెలియనుంది.

# ఓటింగ్ శాతం తగ్గడం దేనికి సంకేతం..!



హైదరాబాద్,భారత ఎన్నికల కమీషన్ వివరాల ప్రకారం 19 ఏప్రిల్ 2024న నిర్వహించిన 102 ఎంపీ పార్లమెంట్ స్థానాలకు తొలి విడత పోలింగ్‌లో 66.14% మంది ఓట్లు వేయగా, 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ శాతం 69.4గా నమోదు అయింది. అదే విధంగా 26 ఏప్రిల్ 2024న జరిగిన రెండవ విడత 88 ఎంపీ స్థానాల్లో 66.71% మంది ఓట్లు వేయగా, ఇదే స్థానాల్లో 2019లో 69.2 శాతం ఓటర్లు ఓట్లు వేశారు. 07 మే 2024న జరిగిన 3వ విడత ఎన్నికలు 93 ఎంపీలకు నిర్వహించగా అందులో 64.4%, 13 మే 2024న 4వ విడతలో 96 స్థానాలకు నిర్వహించగా 67.25 శాతం ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఇదే స్థానాలకు 2019లో 67.33 శాతం మంది తమ ఓట్లు వేశారు. 2019లో నిర్వహించిన ఎన్నికల్లో మొత్తంగా 67.4 శాతం మంది తమ ఓట్ల హక్కును వినియోగించుకున్నారు. 2024లో మొత్తం ఓటింగ్ శాతం 2019 ఓటింగ్ శాతం (67.4 శాతం) చేరడం కష్టంగానే తోస్తోంది. 2019 సాధారణ ఎన్నికలతో పోల్చితే 2024 ఎన్నికల్లో తొలి విడతలో 3.26%, 2వ విడతలో 2.49%, 3వ విడతలో 2.93% ఓటింగ్ తగ్గడం మన ఓటర్ల నిరాసక్తతకు, ప్రజాస్వామ్యంపై అపనమ్మకం, క్యూలో నిలబడటానికి ప్రతికూలంగా వేసవితాపం పెరగడం, పట్టణ ప్రజలు ఓటింగ్ రోజున అనాలోచితంగా అభిప్రాయపడుతున్నారు. యుపిలోని జియాబాద్ పట్టణంలో 49.88%(2019లో 55.88%), బెంగళూరు సెంట్రల్‌లో 54.06% (2019లో 54.31%), దక్షిణ బెంగళూరులో 53.17% (2019లో 53.69%) మాత్రమే నమోదు కావడానికి పట్టణ ఓటర్ల విచిత్ర ప్రవృత్తి ఉంది. బెంగళూరు రూరల్‌లో 68.3%, బెంగళూరు అర్బన్‌లో 64.90% ఓటింగ్ జరగడం గమనించారు. ఇప్పటి వరకు జరిగిన మూడు విడతల ఎన్నికల్లో సగటున 3% ఓటింగ్ శాతం తగ్గడం పట్ల భారత ఎన్నికల కమీషన్ విచారాన్ని వ్యక్తం చేయడంతో పాటు తగ్గిన ఓటింగ్ శాతం కూడా ప్రభావితం చేస్తాయనటంలో అతిశయోక్తి లేదు. నగరాల్లో ఓటింగ్ శాతం పెంచడానికి ఎన్నికల కమిషన్ తీసుకున్న చర్యలు కూడా ఏ విధంగా ఉన్నా చూపలేకపోవడం బాధాకరం. 2019 ఎన్నికల్లో 30 కోట్ల భారతీయ ఓటర్లు, ముఖ్యంగా వలస ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోలేకపోయారు. భారత్‌లోనే అత్యధిక ఓటర్లు కలిగిన యుపిలో 3వ విడతలో57.34% మాత్రమే నమోదుకావడంతో పాటు ప్రతి ఏటా తక్కువ ఓటింగ్ శాతం నమోదవుతోంది. వలస కార్మికులకు తమ గ్రామాల్లో ఓటు హక్కు ఉండటం, ఓటింగ్ రోజు వేతనంతో కూడిన సెలవులు లేకపోవడం, గ్రామాలకు వెళ్లడానికి రవాణా ఖర్చులు లేకపోవడం లాంటి పలు కారణాలు తక్కువ ఓటింగ్ శాతం నమోదుకు దారి తీస్తున్నాయి. రిమోట్ పద్ధతిలో వలస ఓటర్లకు తాము ఉన్న ప్రాంతం నుంచే ఓటు వేయడానికి అనుమతులు ఉండాలని ప్రజాస్వామ్యవాదులు కోరుతున్నారు. రానున్న రోజుల్లో ఎండలు తీవ్ర రూపం దాల్చడంతో వాతావరణ శాఖ ప్రకటించడం కూడా రానున్న ఎన్నికల్లో తక్కువ ఓటింగ్ శాతం నమోదు కావచ్చని ఊహిస్తున్నారు. 17వ సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఇలాగే తక్కువగా నమోదు కావడం గమనించడం లేదు. 1951-52లో నిర్వహించిన తొలి పార్లమెంట్ ఎన్నికల్లో దేశఓటింగ్ శాతం 45.67% మాత్రమే నమోదైంది. 1951 -52 తర్వాత నిర్వహించబడిన 16 సాధారణ ఎన్నికల్లో 2019లో 67.4% వరకు మాత్రమే నమోదు, మొత్తంగా 9 సార్లు ఓటింగ్ 60% దాటడం. 2014లో జరిగింది సాధారణ ఎన్నికల్లో ఓటింగ్ శాతం 66.44గా రికార్డు. తక్కువ ఓటింగ్ శాతం నమోదు అయినప్పుడు అధికార పార్టీలకు నష్టం వాటిల్లుతుందనే వాదనలతో పాటు ప్రజాస్వామ్య పరిరక్షణ, ఎన్నికల స్ఫూర్తికి విఘాతాలు కూడా వివరించబడుతున్నాయి. పాలక పార్టీపై సదాభిప్రాయం ఉన్న ఓటర్లు కొందరు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో విఫలమవుతున్నట్లు, జడత్వాన్ని ప్రదర్శిస్తున్నట్లు విశ్లేషిస్తున్నారు. ఎలాగూ గెలుస్తామని ధీమాతో ఉన్న అధికార పార్టీ కార్యకర్తల ప్రచార నిర్లక్ష్యం, తొలిసారి ఓటు వేయాల్సిన నవయువత కూడా ఓటింగ్ శాతం పడిపోవడానికి ఆజ్యంపోస్తున్నది. చివరి విడతల ఎన్నికల్లో యువత తొలిసారి ఓటు వేసే నవతో పాటు ఇతర ఓటర్లకు అవగాహన కల్పించడం, ఓటు విలువను అవగతం చేయడం, ఓటు వేసే స్వీప్ గుర్తింపును ప్రచారం చేయడం, ప్రజాస్వామ్య విలువలను తెలియజేయడం, ప్రజాస్వామ్యానికి ఓటరే పట్టుకొమ్మ అని వివరించడం నిరంతరం కొనసాగాలి. ఓటు హక్కుతో నిజాయితీ కలిగిన నాయకులను ఎన్నుకోవాలని, నోటాకు ఓటు వేయకూడదని, అభ్యర్థుల్లో ఉత్తములకు తమ ఓటు వేయాలని ఓటరు మహాశయులకు హితబోధ చేద్దాం. ప్రపంచంలోనే అతి పెద్ద భారత ప్రజాస్వామ్యానికి పట్టాభిషేకం చేద్దాం.

# చిత్తవుతున్న ధాన్యం రైతులు..దళారులను ఆశ్రయిస్తున్నరైతన్న

ఆదిలాబాద్, ఎన్నిచర్యలు తీసుకున్నా,అధికారులు పర్యవేక్షిస్తున్నా రైతుకు దళారుల బెడద తప్పడం లేదు. గత్యంతరం లేని రైతులు మధ్య దళారులకే విక్రయిస్తున్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులు ఏటా సమస్యలు ఎదుర్కొంటున్నా వారిని పట్టించుకోవడం లేదు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని దిగుబడి తగ్గిందని ఓ వైపు ఆందోళన చెందుతుంటే మరోవైపు పంట కొనుగోళ్లు లేక కలవరపడుతున్నాడు. నిబంధనల పేరిట ప్రభుత్వరంగ సంస్థలు ఇబ్బంది పెడుతుంటే.. దళారులు ధర తగ్గించి పంట కొనుగోలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో జిల్లాల్లో దళారులది ఆడిందే ఆటగా మారింది. మొదట్లో పంట బాగానే ఉన్నా అకాల వర్షాల వల్ల పంట కొంత దెబ్బతింది. కొనుగోలులో అవకతవకలు జరుగకుండా ఉండాలనే ఆలోచనతో రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులను కూడా జారీ చేశారు. మధ్య దళారులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకోకుండా ఉండాలనే ఆలోచనతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయినా తేమశాతం పేరుతో తరుగు తీస్తున్నారు. అయితే అధికారులు నిబంధనలు పెట్టడంతో ఇప్పుడు పల్లెల్లోకి దళారులు వచ్చి నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇందులో కూడా కొందరు తూకంలో మోసానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పల్లెల్లో ఇలా ఏ గ్రామానికి వెళ్లినా మధ్య దళారులు ఇలా రైతుల ఇంటికి వెళ్లి తక్కువ ధరకే నేరుగాకొనుగోలు చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా వ్యవసాయాధికారులుగానీ, మార్కెటింగ్ అధికారులుగానీ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# ఎన్నికల కోడ్ ముగిసాక ఎక్సైజ్ శాఖ ప్రక్షాళన

హైదరాబాద్,తెలంగాణలో కొత్త మద్యం బ్రాండ్లు తీసుకొస్తున్నామనేది దుష్ప్రచారమే నని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొత్త బ్రాండ్ల కోసం ఎవరూ దరఖాస్తు చేయలేదని, అసలు పరిశీలనే జరగలేదని స్పష్టం చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరవాత ఎక్సైజ్ శాఖను పూర్తిగా ప్రక్షాళన చేస్తామని అన్నారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. దొంగే దొంగ అన్నట్లుగా భారాస నేతల మాటలు ఉన్నాయి. వారు ప్రతిదీ ఆరోపణలు చేసి బద్‌నామ్ చేసే దిశగా రారాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వం చాలా శాఖల్లో బిల్లులు పెండింగ్‌లో పెట్టింది. రైతు భరోసాకు సంబంధించి రూ.6వేల కోట్లకు పైగా చెల్లింపులు మా ప్రభుత్వంలో జరిగాయి. ఈ నెలలోనే రూ.370 కోట్ల చెల్లింపులు చేశాం. మద్యం కొరత ఉంటే ప్రభుత్వానికే నష్టం.. ప్రజలకు కాదు. బ్లాకులో అమ్మిన ఘటనలపై ఎక్సైజ్ శాఖ కేసులు నమోదు చేసింది. టానిక్‌లకు గత ప్రభుత్వం ఇచ్చిన పన్ను మినహాయింపులను రద్దు చేశాం. తయారీ యూనిట్ల వద్ద ఎలాంటి అక్రమాలు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పోలీసులు నిరంతరం పరిశీలిస్తున్నారు. గతంలో పైరవీలు, ముడుపులు ఉంటే తప్ప ఉద్యోగుల బదిలీలు జరిగేవి కావు. ఇప్పుడు అలాంటివేవీ లేకుండానే పోర్టల్ ద్వారా బదిలీలు జరుగుతున్నాయి. తప్పుడు రాతలు రాసిన పత్రికపై పరువునష్టం దావా వేస్తాం. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత ఎక్సైజ్‌శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తాం అని జూపల్లి తెలిపారు.

# ఫెడెక్స్ పార్సిల్స్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్

హైదరాబాద్,ఇటీవల ఫెడెక్స్ కొరియర్ పేరుతో చాలా మందికి కాల్స్ వస్తున్నాయి. ఆధార్ నెంబర్‌తో పార్సిల్ వచ్చిందని.. అందులో అక్రమంగా రవాణా చేస్తున్న మాదక ద్రవ్యాలు పట్టుబడ్డాయని భయాందోళనకు గురి చేస్తున్నారు. డ్రగ్స్ రవాణా కేసులో శిక్షలు కఠినంగా ఉంటాయని.. కేసుల నుంచి తప్పించుకునేందుకు రూ.లక్షల్లో డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇలా ఎందరో సైబర్ నేరగాళ్ల బారినపడి లక్షల్లో సొత్తును నష్టపోయారు. ఈ క్రమంలో తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. ఫెడెక్స్ పార్సిల్స్ పేరుతో వచ్చే మోసపూరిత కాల్స్‌ని నమ్మొద్దని.. పోలీసులమని చెప్పగానే భయపడి డబ్బులు ఇవ్వొద్దని చెప్పారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానం వచ్చినా.. మోసపోయినా వెంటనే 1930 నంబర్‌కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. అయితే, సైబర్ నేరగాళ్ల బారినపడ్డ వారిలో ఎక్కువ మంది విద్యావంతులే ఉండడం ఆందోళనకరమన్నారు. సైబర్ నేరగాళ్లు మోసాలకు కొత్త కొత్త వాటిని ఎంచుకుంటున్నారన్నారు. ఇంతకు ముందు ఓటీపీ, ఓఎల్ఎక్స్, రెంట్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడ్డారన్న ఆయన.. తాజాగా ఫెడెక్స్ పేరుతో మోసాలకు తెరలేపారని చెప్పారు. తాము పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని.. మీరు పంపిన పార్సిల్‌లో డ్రగ్స్ ఉన్నాయంటూ బెదిరింపులకు పాల్పడుతూ డబ్బులు గుంజుతున్నారని అన్నారు. ఎవరూ పార్సిల్స్ పంపనప్పుడు ఎందుకు భయందేనికని ప్రశ్నించారు. మోసాల బారినపడుతున్న వారిలో విద్యావంతులే ఎక్కువ ఉన్నారన్నారు. అవతలి వ్యక్తులు భయపడితే భయపెడతారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే, పెట్టుబడులు పెడితే లక్షల్లో ఆదాయం వస్తుందని ఆశపడొద్దని సూచించారు. అన్ని వివరాలు తెలుసుకున్న తర్వాతే పెట్టుబడులు పెట్టడం మంచిదని చెప్పారు.

# వ్యూహం ప్రకారమే దాడులు

అమరావతి,ఏపీలో ఎన్నికల పోలింగ్ రోజు, ఆ తర్వాత జరిగిన హింసపై సిట్ తన ప్రాథమిక నివేదికను డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాకు అందించింది. ఈ నివేదికను సిట్ చీఫ్ వినీత్ బ్రిజ్‌లాల్ డీజీపీకి అందజేశారు. మూడు జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటించిన ఈ బృందం.. ఆదివారం అర్ధరాత్రి వరకు ప్రత్యేక దర్యాప్తు కొనసాగించింది. పల్నాడు, తిరుపతి, అనంతపురం జిల్లాల్లో 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు ప్రత్యేక దర్యాప్తు బృందం సిట్ అధికారులు గుర్తించారు. ఈ దమనకాండపై రెండు రోజులపాటు విచారణ జరిన సిట్.. అల్లర్లు జరిగిన ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి విచారణ జరిపింది. రాష్ట్రంలో హింసాత్మక ఘటనలపై సిట్ ఇచ్చిన 150 పేజీల నివేదికలో పలు కీలకాంశాలను పొందు పరిచింది. మూడు జిల్లాల్లో దాదాపు 33 హింసాత్మక ఘటనలు జరిగినట్లు తేల్చింది. పల్నాడు జిల్లాలోని 3 అసెంబ్లీ స్థానాల్లో 22 కేసులు, అనంతపురం జిల్లా తాడిపత్రిలో 7 కేసులు, తిరుపతి జిల్లాలోని 2 అసెంబ్లీ స్థానాల్లో 4 కేసులు నమోదైనట్లు సిట్ వెల్లడించింది. క్షేత్రస్థాయిలో పోలీసులు, బాధితులు, ఇతర వర్గాల నుంచి సాక్ష్యాలు సేకరించి నివేదిక రూపొందించినట్లు పేర్కొంది. 33 కేసుల్లో ఎఫ్ఐఆర్ ప్రకారం 1,370 మంది నిందితులుగా ఉన్నారని, ఇప్పటి వరకు 124 మంది అరెస్టయ్యారని తెలిపింది. మిగతావారిని కూడా అరెస్ట్ చేయాలని సూచించింది. రెండు వర్గాల ఘర్షణలు మరణాలకు కారణమై ఉండేవని తేల్చింది. కేసుల దర్యాప్తులోనూ తీవ్ర లోపాలు గుర్తించినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. మరోవైపు నమోదైన ఎఫ్ఐఆర్‌లో కొత్త సెక్షన్లు చేర్చే అంశంపైనా సిట్ సిఫారసు చేసినట్లు తెలుస్తోంది. కొత్తగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలా? వద్దా అనే అంశంపైనా నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. హింస జరుగుతుందని తెలిసీ కొందరు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా సిట్ నిర్ధరించింది. స్థానిక నేతలతో కుమ్మక్కైన పోలీసులు హింస జరుగుతున్నా.. మిన్నకుండిపోయారని ఈ నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కొందరు పోలీస్ అధికారులపైనా కేసులు నమోదు చేసే అవకాశం కనబడుతోంది. ఈ ఘటనల్లో ఉపయోగించిన రాళ్లు, కర్రలు, రాడ్లు వంటి సామగ్రికి సంబంధించిన ఆధారాలూ సేకరించిన సిట్.. ఈ ఘటనలతో సంబంధం ఉన్న పలువురు రాజకీయ నేతల్ని సైతం అరెస్టు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపు సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యలపైనా కొన్ని సిఫారసులు చేసినట్లు తెలుస్తోంది. ఈ నివేదికను డీజీపీ.. కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి ప్రభుత్వం ద్వారా అందించనున్నారు. ఈ ఘటనలపై పూర్తి నివేదికను ఇచ్చేందుకు మరికొంత సమయం కావాలని సిట్ కోరే అవకాశం ఉంది. ఏపీలో ఎన్నికలకు ముందు, తర్వాత జరిగిన హింసాత్మక ఘటనలపై ఈసీ ఆదేశాల మేరకు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు 13 మంది సభ్యులతో సిట్ బృందాన్ని ప్రభుత్వం నియమించింది. హింసాత్మక ఘటనలు జరిగిన ప్రాంతాల్లో సిట్ విచారణ పూర్తి చేసింది. సోమవారం సాయంత్రం డీజీపీ హరీష్ కుమార్ గుప్తాతో సిట్ సారథి వినీత్ బ్రిజ్ లాల్ భేటీ అయ్యారు. 150 పేజీలతో సుదీర్ఘ నివేదికను వినీత్ బ్రిజ్ లాల్ డీజీపీ కి సమర్పించారు. ఇప్పటికే పలు స్టేషన్లలో వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యారు. ఘర్షణ తీవ్రతను బట్టి పలు ఠాణాల్లోని నమోదైన కేసులకు సంబంధించి కొన్ని సెక్షన్లు మార్పులు చేయాలని సిట్ నివేదికలో ఉన్నట్లు..

# రాష్ట్ర అవసరాలకే సన్నాల సాగు!.. ప్రభుత్వ బోనస్ ప్రకటన ఇందుకే



హైదరాబాద్, రాష్ట్ర ప్రభుత్వం రానున్న వానకాలం సీజన్ నుంచి సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. సన్నవడ్లకు బోనస్ ఎందుకు ఇవ్వాలనుకుంటున్నది మంత్రులు స్పష్టం చేశారు. రాష్ట్ర అవసరాలకు ఏటా 36 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం అవసరమని, దీనికోసం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తున్నందున ఈ ఏడాది బియ్యమంతా రాష్ట్రంలోనే సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అందుకే సన్న వడ్ల సాగును ప్రోత్సహించడానికే బోనస్ ఇవ్వాలనుకుంటున్నట్లు తెలిపారు. ఎక్కడ ఎలాంటి రకాలు వేసుకోవాలో వ్యవసాయ అధికారులు ప్రకటిస్తారని మంత్రులు చెప్పారు.దీనిపై అధికార, విపక్షాల మధ్య విమర్శలు మొదలయ్యాయి. రాష్ట్ర వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సన్నవడ్ల అన్నిచోట్ల సాగు కావని, ఎన్నికలకు ముందు అన్నిరకాల వడ్లకు బోనస్ ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు మాట మారుస్తున్నదని విపక్షాలు మండిపడుతున్నాయి. అయితే రాష్ట్రంలో భిన్నమైన వాతావరణ పరిస్థితులున్నా అన్నిచోట్లా సాగుకు అవకాశాలున్నాయని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం ఎందుకు సాగు చేయమని రైతులకు సూచిస్తున్నది? అవి సాగు చేసే రైతులకు బోనస్ ఎందుకు ఇవ్వాలనుకుంటున్నది ఈ కథనం ఉద్దేశం.కొంతకాలంగా దేశంతో పాటు రాష్ట్రంలోనూ భారీ మొత్తంలో దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోతున్నాయి. దీనికితోడు ప్రతి సీజన్లోనూ రాష్ట్రంలోని రైతులు పెద్ద మొత్తంలో దొడ్డు రకం వడ్లను సాగు చేస్తున్నారు. దీంతో వాటి నిల్వలు పెరిగిపోతుండగా, సన్న రకాలకు కొరత ఏర్పడుతున్నది. ఫలితంగా మార్కెట్లో సన్న బియ్యం రేట్లు వినియోగదారులకు అందనంతగా పెరిగిపోతున్నాయి. వస్తు కొరత ఏర్పడితే డిమాండ్ పెరుగుతుంది అన్నట్టు మార్కెట్లో సన్న బియ్యం కొరత ఉండటంతో ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నది తెలిసిందే. రాష్ట్ర అవసరాలు, రైతుల ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నదని తెలుస్తోంది.అలాగే మధ్యాహ్న భోజన పథకం, సంక్షేమ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకు రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం సరఫరా చేస్తోంది. రేషన్ కార్డుదారులకు దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీ కింద ఇచ్చే రెండు రూపాయలకు కిలో బియ్యం పథకం ద్వారా సన్న బియ్యాన్నే సరఫరా చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు దాన్ని నిలబెట్టుకోవడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెబుతున్నది.ఏటా వానకాలం, యాసంగి రెండు పంట సీజన్లలోనూ కస్టమ్ మిల్లింగ్ చేయించిన బియ్యాన్ని రాష్ట్రంలో ప్రజాపంపిణీ అవసరాలకు ప్రభుత్వం వినియోగిస్తున్నది. ఒకవైపు రైతుల నుంచి సేకరించిన దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోతుంటే సన్న బియ్యం కోటా మన రాష్ట్ర పంపిణీ అవసరాలకు కూడా సరిపోవటం లేదు. గత ప్రభుత్వం వలె వరి వేస్తే ఉరే అన్నట్టు ప్రస్తుత ప్రభుత్వం చెప్పడం లేదు. సన్న వడ్లు సాగు చేసే వారిని ప్రోత్సహిస్తామని చెబుతున్నది. అలాగని దొడ్డు వడ్లు సాగు చేసినా కనీస మద్దతు ధర ప్రకారమే కొనుగోలు చేస్తామన్నది. కాబట్టి ఈ విషయంలో రైతుల్లో ఎలాంటి గందరగోళం లేదని విపక్షాలు కావాలనే ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించింది. రైతులను రెచ్చగొట్టి రాజకీయం చేయాలని చూస్తున్నదని మండిపడుతున్నది.రేషన్ షాపుల ద్వారా (రాష్ట్ర ప్రభుత్వ కార్డులు, జాతీయ ఆహార భద్రత కార్డుల కింద) ఏడాదికి 24 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ప్రజా పంపిణీ వ్యవస్థకు అవసరం. అంటే 36 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యానికి సమానం. అలాగే దొడ్డు బియ్యం తినేందుకు రేషన్ కార్డుదారులు ఇష్టపడటం లేదు. చాలాచోట్ల వీటిని అమ్ముకుంటున్న ఉదంతాలున్నాయి. అందుకే సన్నాల సాగు పెరిగితే రాష్ట్రంలోని రేషన్ షాపుల ద్వారా కూడా ఈ బియ్యాన్ని పంపిణీ చేయాలని ప్రభుత్వం యోచిస్తున్నది.రాష్ట్ర సివిల్ సప్లయిస్ విభాగం మిల్లింగ్ చేయిస్తున్న వాటిలో దొడ్డు బియ్యం 98 శాతం ఉండగా.. సన్న బియ్యం ఒకటీ రెండు శాతం మించి ఉండటం లేదు. మారిన అవసరాలకు అనుగుణంగా రైతులు దొడ్డు రకాలకు బదులు సన్నరకాల వరి సాగుపై దృష్టి సారిస్తే ఈ పరిస్థితిని అధిగమించే వీలున్నది. దొడ్డు రకంతో పోలిస్తే సన్న ధాన్యాల దిగుబడి కొంత తగ్గుతుంది. అందుకే రైతులు దొడ్డు రకం ధాన్యం ఎక్కువగా సాగు చేస్తున్నారు. కానీ సన్న ధాన్యానికి బోనస్ ఇవ్వటం ద్వారా రైతులకు వచ్చే దిగుబడి నష్టాన్ని పూడ్చే వీలుంటుందని ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తున్నది.వ్యవసాయ శాఖ అంచనాల ప్రకారం 2019%-%20లో రాష్ట్రంలో 91.45 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకం వడ్ల దిగుబడి ఉండగా. 86.79 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం దిగుబడి వచ్చింది. 2020%-%21 లో 125.51 లక్షల మెట్రిక్ టన్నుల సన్న దాన్యం, 93.01 లక్షల దొడ్డు ధాన్యం, 2021%-%22లో 105.90 లక్షల మెట్రిక్ టన్నులు సన్నవి, 96.26 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి వచ్చింది. 2022%-%23లో 178.46 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, కేవలం 79.74 లక్షల సన్న ధాన్యం, 2023%-%24లొ 174.18 లక్షల దొడ్డు ధాన్యం, 86.26 లక్షల సన్న ధాన్యం దిగుబడి వచ్చింది. గడిచిన రెండేళ్లలో దొడ్డు బియ్యం సాగు భారీగా పెరిగిపోయి సన్న ధాన్యాల సాగు గణనీయంగా తగ్గిపోయింది.కానీ మార్కెట్లో సన్న రకాల డిమాండ్, వినియోగం ఎక్కువగా ఉన్నది. అందుకే రేటు కూడా ఎక్కువ. ఈ నేపథ్యంలోనే సన్న రకాల వరి సాగు పెరిగేలా రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న బోనస్పై రైతుల నుంచి ఎలాంటి వ్యతిరేకత వ్యక్తం కావడం లేదు. వ్యవసాయ నిపుణులూ రాష్ట్రంలో అన్నిప్రాంతాల్లో సన్న రకాలు సాగు చేయడానికి అనుకూల వాతావరణం ఉన్నది. కాబట్టి ప్రాంతాల వారీగా అక్కడి పరిస్థితులకు అనుగుణంగా ఎలాంటి రకం సాగు చేయాలన్నది వ్యవసాయ నిపుణులు సూచిస్తారు. రైతుల సంక్షేమం కోరే వారు ఎవ్వరూ ఈ అంశంపై రాజకీయం చేయకుండా ప్రభుత్వానికి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వాలని రైతుల వాదన.

# హీట్ పెంచుతున్న ఉప ఎన్నిక...



హైదరాబాద్,తెలంగాణలో మరో ఉప ఎన్నిక హీట్ పెంచుతోంది. వరంగల్- ఖమ్మం- నల్గొండ ఉమ్మడి జిల్లాల పరిధిలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక ఈ నెల 30న జరగనుంది. కాగా, పోటీలో ఉన్న అభ్యర్థులు హోరాహోరీగా ప్రచారం చేస్తున్నారు. ఆయా పార్టీల నేతలు తమ అభ్యర్థుల గెలుపు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. పట్టభద్రుల నియోజకవర్గం నుంచి 2021లో ఎమ్మెల్సీగా గెలుపొందిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఈ మధ్య జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనగామ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. దీంతో తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో ఉప ఎన్నిక అనివార్యమైంది. మొత్తం 52 మంది ఈ స్థానానికి పోటీ పడుతుండగా, ప్రధాన పార్టీలైన కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు.

కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు..

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీకి సీపీఎం మద్దతు తెలిపింది. ఈ మేరకు పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న గెలుపునకు కృషి చేస్తామని, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో లౌకిక విలువలు, ప్రజాస్వామ్యం కోసం ఇండియా కూటమిలో భాగస్వామ్యమైన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చామని పేర్కొన్నారు. అలాగే.. ఇప్పుడు కూడా బీజేపీని ఓడించడం కోసం కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తామని తమ్మినేని వెల్లడించారు.

ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోవడంపై బీఆర్ఎస్ ఫోకస్

వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు భారత రాష్ట్ర సమితి యత్నిస్తోంది. తెలంగాణలో శాసనమండలి పునరుద్ధరణ అయినప్పటి నుంచి అక్కడ గులాబీ పార్టీ అభ్యర్థులే గెలుస్తూ వస్తున్నారు. దీంతో త్వరలో జరగనున్న ఉప ఎన్నికలోనూ పార్టీ అభ్యర్థిని గెలిపించుకునేందుకు బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇప్పటికే జిల్లాల్లో సమావేశాలు నిర్వహించడంతో పాటు మూడు ఉమ్మడి జిల్లాల నేతలతో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఎమ్మెల్సీ ఉప ఎన్నిక ప్రచారంలోనూ కేటీఆర్ స్పీడు పెంచారు.

దృష్టిపెట్టిన బీజేపీ..

ఎమ్మెల్సీ ఉప ఎన్నికపై బీజేపీ ప్రత్యేక దృష్టి పెట్టింది. విజయమే లక్ష్యంగా వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. శాసనమండలిలో తమ బలం పెంచుకునేందుకు ఉప ఎన్నికల్లో గెలిచి సత్తా చాటాలని భావిస్తోంది. ఉద్యోగ, నిరుద్యోగ యువతకు కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి చేసిన మోసాలను వివరిస్తూ మండలిలో పట్టభద్రుల గళం వినిపించేందుకు తమ అభ్యర్థిని గెలిపించాలని కమలదళం అభ్యర్థిస్తోంది. ఆ పార్టీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి విజయం కోసం పార్టీ నేతలు ప్రచారం చేస్తున్నారు.

# కేంద్ర,రాష్ట్ర సంబంధాలు బలపడాలి




న్యూఢిల్లీ, పార్టీలు వేరయినంత మాత్రాన దేశం వేరు కాదన్న విషయం ఆయా రాష్ట్రాల సిఎంలు గమనించాలి. ఐదుదశల పోలింగ్ ముగిసింది. మరో రెండు దశలు మిగిలి ఉన్నాయి. కేంద్రంలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేయబోయేది జూన్ నాలుగును తేలనుంది. కొత్తగా అధికారంలోకి వచ్చే ప్రబుత్వం దేశహితం కోసం వేగంగా అడుగులు వేయాల్సి ఉంది. రాష్ట్రాల్లో ఏ పార్టీ ప్రభుత్వం ఉన్నా కలుపుకుని పోవాలి. అభివృద్ధి విషయంలో ఉమ్మడి జట్టుగా పోరాడాలి. అలాగే కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న అధికారిక సంబంధాలు వేరు. కేంద్రం కూడా పెద్దతరహాలో రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవాలి. అప్పుడే కేంద్ర రాష్ట్రాల మధ్య బంధం బలోపేతం అవుతుంది. నీతి ఆయోగ్ ఏర్పాటు సందర్భంగా ప్రధాని మోడీ కూడా కేంద్ర రాష్ట్ర సంబంధాలపై కొత్త నిర్వచనం ఇచ్చారు. కానీ మోడీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అందుకే కొత్తగా ఏర్పడే ప్రభుత్వం రాష్ట్రాలకు నిధుల కేటాయింపు మొదలు, అభివృద్ధి పనులు కూడా పరస్పర విశ్వాసంతో కొనసాగించాల్సి ఉంటుంది. . రాష్ట్రాలు తప్పుదోవ పడుతున్న సందర్భంలో అవసరమైన హెచ్చరికలు కూడా చేయాలి. ఇదే సందర్భంలో తాజాగా మారిన రాజకీయాల క్రమంలో ఆయా రాష్ట్రాల ఆర్థిక స్తితిపైనా నీతి ఆయోగ్ ద్వారా హెచ్చరికలు చేయడం మంచిదే. ఇకపోతే సిఎంలుగా ప్రతి ఒక్కరూ ప్రధానితో నిరంతరం సమీక్షించుకునే అవకాశాలు ఉండాలి. కనీసం ఒక్కో రాష్ట్రానికి ప్రధాని నెలలో ఒకరోజయినా సమయం కేటాయించి రాష్ట్రాల బాగోగులు, సమస్యలు చర్చించాలి. నీతి ఆయోగ్ సమావేశలను కూడా కనీసం మూడు నెలలకో మారయినా సమావేశ పరచి చర్చిస్తే మంచిది. ధాన్యం సేకరణ, నదీజలాల కేటాయింపు సమస్యలు,విద్యుత్ సమస్యలు, ప్రభుత్వరంగ సంస్థల అమ్మకాలు వంటివి ఏవైనా రాష్ట్రాలతో చర్చించాలి. వాటిని విశ్వాసంలోకి తీసుకోవాలి. ఈ విషయంలో కేంద్ర రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు పెరగాలి. రేవంత్ కావచ్చు..జగన్ కావచ్చు.. మమతా బెనర్జీ కావచ్చు.. లేదా మరే ఇతర రాష్ట్ర సిఎం అయినా కావచ్చు పాలనాపరమైన విషయాల కోసం కేంద్రంతో నిత్యం సంబంధాలు నెరపాల్సిందే. ఎవరైనా కేంద్రంతో నిరంతరాయంగా అనుసంధానం అవుతూనే ఉండాలి. ఫెడరల్ వ్యవస్థలో సిఎంలు ప్రధానిని ,కేంద్ర మంత్రులను, కేంద్ర అధికారులను కలవడం సర్వసాధారణం. ఇది విమర్శించే రాజకీయ పార్టీలు గుర్తించాలి. ఇదే సందర్భంలో కేంద్ర రాష్ట్రాల మధ్య పన్నుల విధానంలో పారదర్శకత ఉండాలి. జిఎస్టీ విషయంలో ప్రధానంగా చర్చించాలి. ఏయే రంగాలు కదులేవుతున్నదీ చర్చించాలి. రాష్ట్రాల అభివృద్ధితోనే దేశం అభివృద్ధి చెందగలదన్న విశ్వాసంతో కేంద్రం ముందుకు సాగాలి. అవినీతి విషయంలో కూడా ఎవరు చేసినా చట్టబద్దంగా శిక్షకు గురి కావాల్సిందే. ఇందులో బెదిరింపు రాజకీయాలకు తావుండరాదు. ఇకపోతే పలు పెండింగ్ ప్రాజెక్టులు, జిఎస్టీ నిధుల విడుదలకు సంబంధించి కేంద్రంతో సమస్యలు ఉండనే ఉన్నాయి. ఇవన్నీ కూడా పరిష్కరించుకోవడం సిఎంల కర్తవ్యం. ఇవన్నీ చక్కబెట్టుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లాల్సిందే. కేంద్ర రాష్ట్ర సంబంధాలు వేరు..రాజకీయ పోరాటాలు వేరని గుర్తించాలి. రాష్ట్రాలకు సంబంధించి అనేక సమస్యలను ఎప్పుడూ నిలదీయడంలోనూ వెనకడుగు వేయరాదు. అలాగే కేంద్రం కూడా పెద్దన్న పాత్ర పోషించాలే తప్ప నిరంతరరం రాజకీయాం చేయడం సరికాదు.

# ఈ కాషాయం నేతల ఫ్యూచరేంటి ?



అమరావతి,ఏపీ బీజేపీలో గత అయిదారేళ్ళుగా ఒక లెక్కలో హవా చలాయించిన ముగ్గురు సీనియర్ నేతలు ఇపుడు సైలెంట్ అయిపోయారు. ఏపీలో ఎన్నికల వేడి వాడిగా ఉన్న టైం లో కూడా వీరు జోరు చేయలేరు. వీరిలో మొదటి వారు బీజేపీని ఏపీ ప్రెసిడెంట్ గా చేసిన సోము వీర్రాజు. ఆయన బీజేపీలో నాలుగు దశాబ్దాలు పైగా ఉంటూ వస్తున్నారు.ఆరెస్సెస్ బ్యాక్ గ్రౌండ్ ఉంది. పార్టీ పట్ల విధేయత ఉంది. కేంద్ర పెద్దలతో నేరుగా సాన్నిహిత్యమూ ఉంది. అన్ని ఉన్నా తాజా ఎన్నికల్లో టికెట్ మాత్రం తెచ్చుకోకపోయారు. నిజానికి ఆయన రాజమండ్రి నుంచి ఎంపీ సీటుకు పోటీ చేయాలనుకున్నారు. అయితే అక్కడ నుంచి దగ్గుబాటి పురంధేశ్వరి పోటీ చేయడంతో ఆయనకు చెక్ పడింది.పోనీ అసెంబ్లీకి చేయాలని చూసినా రాజమండ్రి సిటీ సీటు ఇవ్వలేదు, అనపర్తిని ఖాళీ పెట్టి ఉంచారు. దాంతో అక్కడ పోటీ చేసినా పరువు పోతుందని ఆయనే నో చెప్పేశారు అని అంటున్నారు. మొత్తానికి ఆయన ఏపీ బీజేపీ అధినాయకత్వం మీద చాలా కోపంగానే ఉన్నారు అని అంటున్నారు. దాని కంటే ముందు ఆయనకు టీడీపీతో బీజేపీ పొత్తు పెట్టుకోవడం అసలు ఇష్టం లేదు అని అంటున్నారు.ఇక బీజేపీలో ఆయన మాట చెల్లుబాటు కాకపోవడంతో ఫుల్ సైలెంట్ అయిపోయారు అని అంటున్నారు. మరో నేత విష్ణు వర్ధన్ రెడ్డి. ఆయన చూస్తే బీజేపీలో ఎపుడూ యాక్టివ్ గానే ఉంటూ వచ్చారు. కానీ ఈసారి ఆయనకూ టికెట్ దక్కలేదు. కదిరి అసెంబ్లీ అయినా లేక హిందూపురం ఎంపీ అయినా పోటీకి ఆయన ఆసక్తి చూపారు కానీ టికెట్ దక్కలేదు. దాంతో ఆయన మౌన ముద్ర దాల్చారు. పైగా ఏపీ బీజేపీ అధినాయకత్వం తో ఆయన దూరం పాటించడం టీడీపీతో పొత్తుకు ఆయన కూడా వ్యతిరేకం అన్న ప్రచారం సాగడంతో సీటు దక్కలేదు అని అంటున్నారు.అలాగే రాజ్యసభ సభ్యుడిగా నిన్నటిదాకా ఉన్న తాజా మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు. ఆయన కూడా బీజేపీ అంటే తానే అన్నట్లుగా ఉత్సాహం చూపించేవారు. కానీ ఇపుడు సీన్ మారింది. ఏపీలో బీజేపీలో చేరిన టీడీపీ నేతలకు పలుకుబడి పెరిగింది. దాంతో పాటు విశాఖ నుంచి ఎంపీ సీటు ఆశిస్తే అది దక్కలేదు. దాంతో ఆయన సైతం మౌనమే నా భాష అని ఉండిపోయారు అని అంటున్నారు.రేపటి ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే వీరు మళ్లీ నోరు తెరచి ఏపీ బీజేపీ అధినాయకత్వం వైఖరి మీద విమర్శలు చేసే అవకాశం ఉంటుంది అని అంటున్నారు. అపుడు కేంద్ర నాయకత్వం కూడా పార్టీని ప్రక్షాళన చేయడానికి పురంధేశ్వరిని మారుస్తారు అని అంటున్నారు. అలా కాకుండా టీడీపీ కూటమి గెలిస్తే మాత్రం రానున్న అయిదేళ్ళూ వీరికి అజ్ఞాత వాసమే అని అంటున్నారు. ఎందుకంటే బీజేపీలో ఇప్పటికే కుదురుకున్న నేతలకే చాన్స్ ఉంటుంది. దాంతో వీరి ఫ్యూచర్ ఏంటి అన్నది వేచి చూడాల్సిందే అని అంటున్నారు.

# సీజనల్ వ్యాధుల నివారణకు ఇదే సమయం




విజయవాడ, వచ్చేది వర్షాకాలం. వర్షాకాలంఓనే సీజనల్ వ్యాధులు ఇబ్బంది పెడుతాయి. ఏటా ఇలాంటి సమ్యలు చూస్తూనే ఉన్నాం. ఈ క్రమంలో ఇప్పటి నుంచే సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలి. వర్షాకాల వ్యాధులపై చైతన్యం చేయాల్సి ఉంది. రాష్ట్రంలో గతంలో ప్రజలు డెంగీ, తదితర వైరల్ జ్వరాలతో ఇబ్బందులు పడేవారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత కొనసాగితే విషజ్వరాలు లేదా, అంటువ్యాధులు ప్రబలవని వైద్యనిపుణులు అంటున్నారు. ప్రతి ఏటా వానాకాలంలో అంటు వ్యాధులు ప్రబలడం సర్వసాధారణంగా మారింది. చలికాంల వచ్చే సరికి స్వైన్ ఫ్లూ లాంటి వ్యాధులు విజృంభిస్తుంటాయి. పట్టణాలు,పల్లెలు అనే తేడా లేకుండా స్వచ్ఛంగా ఉంచాలని పదేపదే ప్రచారం చేస్తున్నా ప్రజలు పట్టించుకోవడం లేదు. ఎవరికి వారు తమకేంటన్న భావనతో అపరిశుభ్రతకు కారణమవు తున్నారు. ముఖ్యంగా దోమల వృద్ధికి అవకాశం ఉన్న ఉన్న నీటి తొట్లు, నీటి నిలువ ప్రదేశాల్లో నీటిని తొలగించే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతోపాటు ఇంటి మూలల్లో ఉన్న ఉపయోగంలో లేని వస్తువులను తీసివేసి, దోమల లార్వా వృద్ధికి అవకాశం లేకుండా చేసే చర్యలను చేపట్టాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పారిశుద్ధ్య నిర్వహణ పైన పైన దృష్టి సారించి సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకునే ప్రయత్నం ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇళ్ళ ముందు కానీ లేదా ఇంటి లోపల నీటి నిలువ ఉండే ప్రాంతాల్లో నీటిని తొలగించే ప్రయత్నం చేయడం లేదా వాటిపైన నూనెను చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దీంతోపాటు ఇళ్లలో ఉన్న పనికిరాని లేదా ఉపయోగం లేని లేని వస్తువులను తొలగించుకోవాలని కోరారు. అప్పుడేసీజనల్ వ్యాధులను రాకుండా నిరోధించ గలమని అన్నారు. కాలువల్లో వాడిపడేసిన వ్యర్థాలను, ప్లాస్టిక్‌ను పడేయడం వల్ల కూడా మురికినీరు నిలిచి పోతోంది. దీనికి ప్రజలే బాధ్యత వహించాలి. మురుగునీటి పారుదల సక్రమంగా లేకపోవడం వల్ల ఏలూరులో వింతవ్యాధి ప్రజలను తీవ్రంగా భయపెట్టింది. ఇకపోతే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నామని నాయకులు చెపుతున్నా వాస్తవం వేరే రకంగా కనిపిస్తోంది. పారిశుద్ధ్య లేమి కారణంగానే ఇటువంటి వ్యాధులు ప్రబలుతున్న విషయం సుస్పష్టం. ఈ క్రమంలో ప్రజలు పురపాలకసంస్థపై ధ్వజమెత్తుతున్నారు. అపరిశుభ్రత కారణంగా దోమలు విజృంభించడం, వింతవ్యాధులు విజృంభించడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నది. సీజనల్ వ్యాధుల నివారణ ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. బహిరంగ ప్రదేశాలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీలు దోమల నివారణతో పాటుగా పారిశుద్ధ్య నిర్వహణ చేసేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో పారిశుద్ధ్య నిర్వహణ పైన దృష్టి సారించి, ప్రభుత్వ ప్రయత్నాలతో కలిసి రావాలి.ముఖ్యంగా దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు సొంత ఇళ్లలోని పారిశుద్యం అత్యంత కీలకమైన అంశం. ఇళ్ళలో పారిశుద్ధ్య నిర్వహణ కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాల్సి ఉంది. ఎప్పటికప్పుడు ప్రజలను చైతన్యవంతం చేసి, పారిశుద్ధ్య నిర్వహణలో వారిని భాగస్వాములను చేసేందుకు ప్రభుత్వ అధికారులు, పురపాలక ప్రతినిధులు కృషి చేస్తూనే ఉన్నారు. ఇళ్ళలో పారిశుధ్య నిర్వహణ చేపట్టి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పదేపదే కోరుతున్నారు.

### పంట మార్పిడితోనే మెరుగైన దిగుబడి

విజయనగరం, రైతులు పంట మార్పిడి చేసుకోవడం ద్వారా భూసారాన్ని కాపాడుకోవడంతో పాటు, పంటల దిగుబడి పెంచుకోవచ్చని వ్యవసాయాధికారులు తెలిపారు. ఏటా ఒకే పంట వెయ్యడం వలన దిగుబడులు ఆశించిన స్థాయిలో రావడం లేదని తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు. రైతులు పంట మార్పిడే కాకుండా కనీసం రకాలను మార్చడం లేదన్నారు. చెరకులో నూతన రకాలు ఉన్నాయని వాటిని సాగు చేసుకోవాలని చెప్పారు. విత్తనం నిమిత్తం ప్రత్యేకంగా తోటలు పెంచుకోవాలని వివరించారు. ఆరునెలల వయసు గల చెరకును విత్తనంగా వాడాలని చెప్పారు. చెరకులో బిందు సేద్యం ద్వారా నీరు, ఎరువులు ఇవ్వాలని చెప్పారు. జిల్లాలో ఏటా పూర్తిస్థాయిలో వర్షాలు పడుతున్నా కురుస్తున్న

# ఇక ఏ వన్ పెద్దిరెడ్డే!? ఎఫ్ ఐ ఆర్ భయం



అమరావతి,ఏపీలో వైనాట్ 175 స్లోగన్ ..మోత ఆగింది. కానీ విజయం మాత్రం వైసీపీదే.. 151 మార్కు దాటుతుందని సొంత సర్వేలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నా.. నిన్నటి వరకూ ఫైర్ బ్రాండ్ ఇమేజీతో ఘర్జించిన నేతలందరూ మౌన దీక్షను బూనారు. కౌంటింగ్ కౌంట్ డౌన్ ముగిసే వరకూ కొందరు విదేశీయానంలో కాలక్షేపం చేస్తుంట మరి కొందరు అగ్రనేతలను ఎఫ్ ఐఆర్ భూతం వెంటాడుతోంది. వీరిలో పెద్దాయన పెద్దిరెడ్డి పేరు మార్మోగుతోంది. ఒకవేళ వైసీపీ అధికారంలోకి రాకపోతే కూటమి గెలిస్తే తొలి ప్రధాన నిందితుడిగా పెద్దిరెడ్డి పేరిట ఎఫ్ ఐఆర్ ప్రత్యక్షం కావటం తథ్యమమని ప్రచారం తెరమీదకు వచ్చింది.

ఎందుకంటే

పెద్దిరెడ్డి హావభావాలు ఆహంభావ స్వరమే.. ఈ చర్చకు దారి తీసింది. చంద్రబాబు నాయుడితోపాటు తెలుగుదేశం పార్టీ నేతలను వేధించడంలో పెద్దిరెడ్డి ముందుండేవారు. చిత్తూరు జిల్లా అంగళ్లులో బాబుపై హత్యాయత్నం స్థాయిలో అల్లరి మూకలు చెలరేగిపోయాయి. వాటివెనక పెద్దిరెడ్డి ఉన్నారనేది బహిరంగ రహస్యం. కుప్పంలో చంద్రబాబును ఓడించడానికి పావులు కదిపారు. హిందూపురం నుంచి బాలకృష్ణను వెళ్లగొడతానన్నారు. వందల సంఖ్యలో టీడీపీ కార్యకర్తలపై కేసులు పెట్టించారు. ఇక ప్రభుత్వం మారితే టార్గెట్ అయ్యేది కూడా పెద్దిరెడ్డే. పోలింగ్ కు ముందే పెద్దిరెడ్డితోపాటు ఆయన కుమారుడు మిథున్ రెడ్డి కూడా సైలెంట్ అయ్యారు.

ఆర్థిక మూలాపై దృష్టి

వైసీపీ ప్రభుత్వ హయాంలో పెద్దిరెడ్డి వ్యవహరించిన తీరుతో ప్రభుత్వం మారిన తర్వాత ఆయన వ్యాపారాలన్నీ మూతపడటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. లొసుగులతో నిండిన వ్యాపారాలు కావడంతో ప్రభుత్వం మారితే కచ్చితంగా టార్గెట్ అవుతానని పెద్దిరెడ్డి కూడా భావించినట్లున్నారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ పీలేరులో మంత్రి పెద్దిరెడ్డి మాఫియా గురించి ప్రత్యేకంగా ప్రస్తావించడం గమనార్హం.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com